ప్రజాశక్తి
ఆదివారం 26 మార్చి 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వాస్తవికతకు దూరంగా గ్రేటర్ బడ్జెట్

- ఆదాయానికి పొంతన లేని అంచనాలు
- 2023- 24కి రూ 4303 కోట్లు జివిఎంసి బడ్జెట్
- విపక్షాల అభ్యంతరాల మధ్య ఏకపక్ష ఆమోదం

ప్రశ్నిస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అంకెల గారిడీతో అంచనాలకు పొంతనలేని 'మహా' బడ్జెట్‌కు శనివారం గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) పాలకవర్గం ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విపక్షాల అభ్యంతరాల మధ్య ఆమోదం తెలిపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికిగాను అన్ని పద్దుల కింద ప్రారంభ నిల్వతో కలిపి రూ.4303 కోట్లు అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్ల వాదోపవాదాల అనంతరం బడ్జెట్‌ను ఆమోది స్తున్నట్టు కోరం ప్రకటించింది. అయితే వార్డుల్లో ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని, మౌలిక సదుపాయాల కల్పనను గాలికొదిలేశారని, ఈ బడ్జెట్ అంతా అంకెల గారడీయేనని టిడిపి, సిపిఎం, బిజెపి, జనసేన తదితర ప్రతిపక్షాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క భవిష్యత్తు మిగతా 2లో..

బడ్జెట్‌పై మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

మోసపూరిత బడ్జెట్ : సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

తాజా బడ్జెట్ మోసపూరితంగా ఉందని, కాగితాల్లోనే రూ.కోట్లు కనిపిస్తున్నాయని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం నాటి ఆదాయ, ఖర్చుల అంకెలను మార్చేశారన్నారు. 2022 నవంబర్ 30న స్థాయీ సంఘం సూచనల మేరకు ఆదాయం రూ.831 కోట్లుగా, మిగతా 2లో..

జి 20 సదస్సుతో విశాఖకు గుర్తింపు

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని
- ఏర్పాట్లుపై మంత్రులు అమర్‌నాథ్, సురేష్‌లతో కలిసి సమీక్ష
- రూ.157 కోట్లతో సుందరీకరణ, అభివృద్ధి పనులు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే జి-20 సదస్సు ద్వారా విశాఖ నగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించనుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని తెలిపారు. ప్రణాళికాయుతంగా వ్యవహరించి సమన్వయంతో ముందుకెళ్లి దేశం గర్వించేలా జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్‌ను మరింత పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సంబంధిత కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒన్ ఎర్త్, ఒన్ ఫ్యామిలీ, ఒన్ ఫ్యూచర్ అనే థీమ్‌తో మూడు రోజుల పాటు జరిగే జి-20 సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఇతర అధికారులతో కలిసి శనివారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై, తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సుందరీకరణ పనుల కోసం రూ.157 కోట్ల నిధులను వెచ్చించినట్లు ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పట్టణాభివృద్ధి, మున్సిపల్ మిగతా 2లో..

మెడ్‌టెక్ జోన్‌లో వెస్టర్న్ ఆస్ట్రేలియా బృందం

వార్త 2లో..

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం

వార్త 5లో..

రామజోగిపేట మృతులకు తక్షణ సాయం అందజేత

వార్త 2లో..

తెలుగు వారియర్స్ జట్టుతో వెంకటేష్

ఉత్సాహంగా సిసిఎల్

వార్త మెయిన్‌లో..

విశాఖ టు పోలవరం

- త్వరలో పాదయాత్ర
- టిడిపి మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్

పోలవరం ప్రాజెక్టు పట్ల జరిగిన అన్యాయంపై అన్ని పార్టీలనూ కలుపుకొని త్వరలోనే విశాఖ నుంచి పోలవరం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నట్టు టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రలో నీటి ప్రాజెక్టులు ఆగిపోయాయన్నారు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబు హయాంలో 70 శాతం పూర్తయిందని, జగన్ సిఎం అయ్యాక ఆ ప్రాజెక్టును భ్రష్టు పట్టించడమే కాకుండా రివర్స్ పాలన సాగించి అన్ని సాగునీటి ప్రాజెక్టలనూ నిర్వీర్యం చేశారన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు.

మండలి ఫలితాలనంతర కదలికలు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అధికార వైసిపి నేతలు చెప్పినట్లుగా 'సెమీ ఫైనల్స్' పూర్తయ్యాయి. అందులో ఓటమి చవిచూశారు. ఇంకా ఫైనల్స్.. 2024 సాధారణ ఎన్నికలే మిగిలి ఉన్నాయి. ఇప్పటి వరకూ ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటూ రకరకాల అంశాలపై డిబేట్ నిర్వహిస్తూ ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు పలువురు నేతలు వెళ్లి కూర్చొని వచ్చారు. వారి లెక్క ప్రకారం ఫైనల్స్‌లోనూ సెమీ పోరు ఫలితమే ప్రతిబింబిస్తుందన్న ఆందోళన కనిపించింది. ఇది వైసిపి శ్రేణులను తాజాగా కలచివేస్తోంది. తాజా మండలి ఎన్నికల్లో తెలుగుదేశం చేతిలో అధికార పార్టీ ఘోర పరాజయం పాలవ్వడంతో వైసిపి నేతలంతా తలలు పట్టుకుంటున్నారు.

వ్యతిరేక ఓటుతో కొన్ని ప్రయోజనాలు

ప్రస్తుతం కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక వాతావరణంలో బలంగా ఉండే ప్రధాన ప్రతిపక్ష రాజకీయ పార్టీకి ఓట్లేయడం ద్వారా ప్రభుత్వాన్ని మిగతా 2లో..

మొదటి వార్షికోత్సవ శుభాకాంక్షలు
అమృత క్లినిక్
మధుమేహవ్యాధి వైద్య నిపుణులు
- బిపి, షుగర్
- థైరాయిడ్ మరియు దీర్ఘకాలిక వ్యాధులు
- మలేరియా టైఫాయిడ్
- విష జ్వరములు
- గుండె, ఉపిరితిత్తులు
- కిడ్ని, నరములు
- లివర్ డిసిజెస్

డా॥డి.విద్యాసాగర్‌రావు
Reg.No. 54787
MBBS, M.D. (General Medicine)
అన్ని రకముల వ్యాధులకు చికిత్స చేయబడును.
Timings : 9.00 am to 9.00 pm
D.No. 10-2-8, Beside State Bank of India, 4 Seasons Bakery, Old Gajuwaka Junction, Visakhapatnam-530026
63011 04143, 85005 90480
FREE CONSULTATION SUGAR TEST 10 AM TO 1PM ON EVERY SUNDAY

మొదటి పేజీ తరువాయి..

మండలి ఫలితాలనంతర కదలికలు..!

భయపెట్టి తమ తమ ప్రయోజనాలను నిలబెట్టుకోవాలన్న కాంక్ష పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యక్తమైనట్లు ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి. మండలి ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన ఎపిజిఎల్ఐ, ఎర్న్‌డ్‌లీవ్స్, పిఎఫ్‌కు సంబంధించిన పాత బకాయిలు కొన్నింటిని క్లియర్ చేయడం కూడా ఒక విజయంగానే వారు భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు మిగతా బకాయిలన్నిటినీ క్లియర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

ప్రభుత్వంపై వ్యతిరేక దెబ్బతోనే ఫలితం

ఈ నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థిత్వాల కంటే.. ప్రభుత్వ వ్యతిరేకతనే వీరంతా దృష్టిలో పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. తొలుత టిడిపి విజయానికి ఒక సామాజిక తరగతే కారణమన్న రీతిలో ప్రచారం సాగింది. ఆ లెక్కన రాయలసీమ ప్రాంతంలో రెండు ఎమ్మెల్సీలకూ ఇలాగే వర్తింపజేసుకుంటే వైసిపియే గెలవాలి. ఎందుకంటే కొన్ని సామాజిక తరగతులు వైసిపినే అంటిపెట్టుకుని ఉన్నాయి. కానీ అక్కడ కూడా టిడిపియే గెలుపొందడం చూస్తే ప్రభుత్వంపై పట్టభద్రుల్లో అసమ్మతి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అంటే ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బలం, వైసిపి అభ్యర్థి బలహీనం అన్న ప్రచారంలో ఎంత మాత్రమూ నిజం లేదన్నది తేలిపోయింది..

దక్షిణం సెగ్మెంట్‌పై ప్రభావం

మండలి ఎన్నికలనంతరం నగరంలోని దక్షిణ నియోజకవర్గంపై చర్చ రాజకీయ తెరమీదకు వచ్చింది. తొలి నుంచీ ఇక్కడ పోటీకి సై అంటున్న సీతంరాజు సుధాకర్ మండలి ఎన్నికల్లోనూ ఓటమి పాలవ్వడంతో మరలా ఇటు దృష్టిసారించారు. రూ.కోట్లు ఖర్చు చేసి చేతులు కాల్చుకున్న ఆయన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి పోటీకి ఆయన అనుచర గణం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదీగాక రాష్ట్రంలో తాజాగా శాసన సభ్యుల ద్వారా ఎమ్మెల్సీని ఎన్నుకునే ప్రక్రియ ఎంత క్లిష్టంగా మారిందన్నది అందరూ చూసిందే. దక్షిణం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న (టిడిపి నుంచి గెలిచి వైసిపిలో చేరిన) వాసుపల్లి గణేష్‌కుమార్ ఓటు కోసం అధికార పార్టీ చాలా పెద్ద కసరత్తు చేసిందన్నది వైసిపి శ్రేణుల్లో తాజాగా చర్చనీయాంశమైంది. ఆయన్ని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు స్వయంగా ఫ్లైట్‌లో జగన్ వద్దకు తీసుకెళ్లి ఒప్పించి తమ పార్టీ ఎమ్మెల్సీకి ఓటు వేయించుకున్నారట. ఇది వాసుపల్లికి త్వరలో మైనస్‌గా నిలవనుంది. వైసిపి హై కమాండ్ సైతం మండలి ఎన్నికలనంతర పరిణామాలపై కసరత్తు చేస్తోంది. మండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు ఓటమి చెందడంతో వాసుపల్లికి ఇబ్బందిగానే మారిందని చెప్పొచ్చు. హై కమాండ్ వద్ద సుధాకర్‌కు మంచి పేరుండడం వాసుపల్లికి మింగుడు పడని అంశంగా ఉంది. కొంతకాలంగా దక్షిణ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలతో తనకంటూ ఒక గ్రూపును ఏర్పాటు చేసుకుని సీతంరాజు సుధాకర్ దూసుకెళ్తుండడంతో వచ్చే ఎన్నికల్లో విశాఖలో 'సౌత్ వార్' తప్పదనిపిస్తోంది.

వాస్తవికతకు దూరంగా గ్రేటర్ బడ్జెట్

జనరంజకంగానే ఉంటుందని వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు చెబుతూ బడ్జెట్ ఆమోదానికి మేయర్‌కు సూచించడంతో సమావేశం ముగిసినట్టయింది. ఏ వార్డుకూ గతంలో ఇస్తామన్న రూ.1.5 కోట్లు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, పనులే జరగనప్పుడు బడ్జెట్ ఎలా రూపొందిస్తారని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు కౌన్సిల్‌లో అడిగారు. బడ్జెట్‌పై వివరణకు అధికారులకు సంబంధం ఏంటని, స్థాయీ సంఘం సభ్యులు రెండుమార్లు సవరణ చేసి బడ్జెట్‌ను ప్రతిపాదించారు కాబట్టి ఆ సభ్యులే సమధానం చెప్పాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. సభలో కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతుండగా ప్రతిపక్ష సభ్యులు మండిపడ్డారు. రాజకీయాలకు ముడిపెట్టొద్దని హితవు పలికారు. అధికార పార్టీ సభ్యులు ఈ బడ్జెట్ సూపర్ అని చెబుతుండగా, ప్రతిపక్షాల సభ్యులు వీరారావు, బొండా జగన్నాథం, కందుల నాగరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి మోసపూరిత బడ్జెట్ అని పేర్కొన్నారు. తొలుత ప్రజలకు అన్ని వసతులూ కల్పించాకే బడ్జెట్ గురించి మాట్లాడాలని టిడిపి సభ్యులు కోరారు. ముడసర్లోవ రిజర్వాయర్‌కు గతేడాది రూ.55 కోట్లును నిర్వహణ వ్యయం కింద చూపించగా, ఈసారి రూ.80 కోట్లగా చూపించడంలో ఆంతర్యమేంటని కార్పొరేటర్ వీరారావు ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టును పిపిపి కింద ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేశారని మండిపడ్డారు. ఈ మేరకు మేయర్ స్పందిస్తూ ఆ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపించామని, లెక్కలన్నీ ప్రతిపాదనలేనని సమాధానమిచ్చారు. సమావేశంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, అధికారులు పాల్గొన్నారు.

మోసపూరిత బడ్జెట్ : సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ఖర్చును రూ.769 కోట్లుగా చూపించారని, అలాంటప్పుడు అధికారులు, పాలకపక్ష నేతలు చెబుతున్నట్టుగా రూ.4 వేల కోట్లకుపైగా చూపించడం ఏంటంటూ మండిపడ్డారు. రూ.1250 కోట్లకన్నా పెరగని బడ్జెట్‌ను విపరీతంగా పెంచి చూపిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఏడాదికి రూ.596 కోట్ల ఆదాయం చూపిస్తే కేవలం రూ.91 కోట్లతో 596 పనులకు ఆమోదించారని, అలాంటప్పుడు మిగతా మొత్తాలు ఎటెళ్లిపోయాయని ప్రశ్నించారు.

జి 20 సదస్సుతో విశాఖకు గుర్తింపు

శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఎలాంటి సమన్వయ లోపం లేకుండా, ఇబ్బందులు కలగకుండా సదస్సును విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా జి-20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంత్రుల బృందానికి వివరించారు. ఈ నెల 27న కొంతమంది విదేశీయులు నగరానికి చేరుకుంటారని, 28న మిగిలిన వారందరూ విచ్చేస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రధాన సదస్సు జరుగుతుందని వివరించారు. అతిథులకు స్వాగతం పలికే క్రమంలో పత్యేక సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేశామని, హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 27న విచ్చేసిన అతిథులకు నగరంలోని కైలాస ప్రాంతంలో పర్యాటక ప్రదేశాలను చూపిస్తామన్నారు. 28న రాడిసన్ బ్లూ హోటల్లో ప్రధాన సమావేశం జరుగుతుందన్నారు. అనంతరం 3.30 గంటల నుంచి 6.30 వరకు మూడు రకాల సమావేశాలు జరుగుతాయని వివరించారు. రాత్రి 7.30 నుంచి 9.30 వరకు అదే హోటల్ సమీపంలోని బీచ్‌లో గాలా డిన్నర్ ఉంటుందని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందన్నారు. 29న హోటల్ సమీపంలోని తీరంలో యోగా, మెడిటేషన్, పౌష్టికాహార వినియోగంపై నిపుణుల చేత అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అల్పాహారం అనంతరం రోజంతా మౌలిక సదుపాయాల కల్పన అనే అంశంపై ప్రధాన సమావేశం జరుగుతుందని వివరించారు. 30న ఉదయం 10 గంటల నుంచి 1.30 వరకు కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్, అనంతరం క్షేత్ర స్థాయి పర్యటన ఉంటాయని తెలిపారు. 31న విదేశీయులు తిరుగు పయనమవుతారని చెప్పారు. సిపి సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ భద్రతా చర్యలను వివరించారు. సమీక్షా సమావేశంలో స్థానిక ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో వెస్టన్ ఆస్ట్రేలియా బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వెస్టన్ ఆస్ట్రేలియా ప్రభుత్వ బృందం భారత పర్యటనలో భాగంగా శనివారం నగరంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించింది. జోన్‌లోని పలు సంస్థలను పరిశీలించిన ఈ బృందం కంపెనీల ప్రతినిధులు, స్టార్టప్‌లతో సమావేశమైంది. అనంతరం మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్ట్రేలియా మంత్రి స్టెఫాన్ డాసన్ మాట్లాడుతూ వైద్య పరిశోధనలు, ఆవిష్కరణలు మనం ఆరోగ్యంగా జీవించేందుకు తోడ్పడుతున్నాయన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలకు ఇది అత్యంత కీలకమైన సమయమన్నారు. వెస్టన్ ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆరోగ్యం, వైద్య పరిశోధనలలో ఉన్న అపార అవకాశాలను ఒడిసిపట్టుకునేందుకు దృష్టి సారించి ఒదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ పరిశోధనలు చేస్తున్న వారైనా వెస్టన్ ఆస్ట్రేలియాకు మారి అత్యున్నత నాణ్యతతో కూడిన, వినూత్నమైన పరిశోధనా కార్యక్రమాలు కొనసాగించవచ్చన్నారు. ఈ పరిశోధనలు ఆదివాసీల ఆరోగ్యం, గ్రామీణ ఆరోగ్యం, వ్యాధుల భారం తగ్గించడం, కోవిడ్ - 19 వంటి అంశాలపై ఉండాలన్నారు. సాంకేతిక రంగంలోని కంపెనీలు వెస్టన్ ఆస్ట్రేలియాలో పెట్టుబడులు పెట్టి తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వెస్టన్ ఆస్ట్రేలియా చీఫ్ సైంటిస్ట్ ప్రొఫెసర్ పీటర్ క్లింకెన్ ఏసీ, ఇండియా, గల్ఫ్ రీజియన్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ నషిద్ చౌదరి, ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర శర్మ పాల్గొన్నారు.

జ్ఞాపిక అందుకుంటున్న ఆస్ట్రేలియా మంత్రి స్టెఫాన్ డాసన్

జిఎఫ్ఎతో అధునాతన జన్యు సంబంధిత పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సంతానోత్పత్తిలేని వారి కోసం లండన్ ఐవిఎఫ్ జన్యు సంబంధిత సంతానోత్పత్తి ఎనాలిసిస్ (జిఎఫ్ఎ) సాంకేతికత ఆధారంగా అధునాతన జన్యు సంబంధిత పరీక్షలను ఆవిష్కరించింది. అందుకు సంబంధించి లండన్ ఐవిఎఫ్ జెనిటిక్ సంస్థతో ఒక ఒప్పందంపై సంతకం చేసినట్టు సంస్థ ప్రతినిధులు శనివారం ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా సంతానోత్పత్తి చికిత్సలో వినియోగిస్తున్న సరికొత్త విప్లవాత్మక సాంకేతిక విధానం జన్యు సంబంధిత సంతానోత్పత్తి ఎనాలిసిస్ (జిఎఫ్ఎ) అని తెలిపారు. చికిత్స వ్యయం చాలా తక్కువని పేర్కొన్నారు. 2015లో లండన్ ఐవిఎఫ్‌ను విశాఖలో స్థాపించామని, ఆ తరువాత మరో రెండు సెంటర్లను రాజమండ్రి, కాకినాడల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. జెనిటెక్ చీఫ్ సైన్స్ ఆఫీసర్ అనురాధ ఉడుముడి మాట్లాడుతూ పునరుత్పత్తి వృద్ధి, బీజకణ ఉత్పత్తి, బీజకణ నిర్మాణం, పనితీరు, ఫలదీకరణ, పిండం వృద్ధి చెందటం, అమర్చుట, గర్భం ధరించడం, బిడ్డ పుట్టటం ఈ విధంగా వివిధ దశలుగా పునరుత్పత్తి సైకిల్ విభజించబడుతుందన్నారు. సంతానలేమికి కారణాలను తెలిపారు. లండన్ ఐవిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ నూతన కుటుంబాల సృష్టికి సహకరించటం, తీవ్రమైన వ్యాధుల బారిన పడకుండా నూతన తరాన్ని నివారించడం, వినూత్న పరిశోధనలకు తగిన మద్దతు అందించడం, తరచుగా సంభవిస్తున్న వైఫల్యాలకు మూల కారణాలను కనుగొనే దిశగా లండన్ ఐవిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

పత్రాలు చూపుతున్న ప్రతినిధులు

రామజోగిపేట మృతులకు తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుధవారం అర్ధరాత్రి విశాఖ కలెక్టరేట్ సమీపంలోని రామజోగిపేటలో మూడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ - సంజీవిని నిధి నుంచి తక్షణ సహాయం అందజేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రమాదంలో మరణించిన సాకేటి దుర్గాప్రసాద్, సాకేతి అంజలి కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఇరవై వేల రూపాయల చెక్కును, బీహార్‌కు చెందిన రాముల్లా సాహ్ కుటుంబానికి రూ.15 వేల చెక్కును ఇచ్చారు. ఘటనకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపామని, ఆదేశాలు వచ్చిన వెంటనే పూర్తి నష్ట పరిహారం అందజేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు దేవాలయాల అభివృద్ధికి ప్రసాద్ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తోందని, అందులో భాగంగా తొలి విడతగా సింహాచలం దేవస్థానానికి మంజూరు చేసిన రూ.54 కోట్ల పనుల వేగవంతానికి సహకారం అందించాలని విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణను సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు కోరారు. శనివారం ఉదయం ఎంపీని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సత్కరించి సింహాద్రి నాథుని జ్ఞాపిక బహూకరించారు.

నగరంలో శ్రీలక్ష్మి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న జి-20 అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి తలపెట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ వై.శ్రీలక్ష్మి శనివారం పరిశీలించారు. విశాఖ ఎయిర్ పోర్ట్‌లో విదేశీ ప్రముఖులకు భద్రత, ఎయిర్ పోర్ట్ దారి పొడవునా సుందరీకరణ పనులతీరును ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఆమె వెంట కలెక్టర్ మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ రాజాబాబు ఉన్నారు.

మహారాజశ్రీ 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు విశాఖపట్నం
E.P. 85/2018 in O.S.348/2018
Between:
ఆది సురేష్‌బాబు . . . వాది / D.Hr
And:
లొంజ సుజాత & ఇతరులు
. . . ప్రతివాది /J.Dr
చరాస్తి వేలం ప్రకటన
పై కేసులో డిక్రీ అమలు నిమిత్తం జె.డి.ఆర్.నెం.1 యొక్క హక్కు కలిగినటువంటి షెడ్యూలు దాఖల చరాస్తి అనగా AP 31 BM 8217 అనే నెంబరు గల మారుతీ సుజుకి Swift కారు శ్రీ కోర్టు వారి ఎదుట **తే:13-04-2023దిన ఉదయం 10-30ని॥** వేలం వేయబడును. అని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
షెడ్యూలు
Car bearing No. **AP 31 BM 8217** bearing Enginee No. K12MN4068068 Chasise No. MA3EKDIS00648063MA Made up of Maruthi Suzuki Swift Model No. VXI BS IV
DHR Value : Rs. 3,00,000/-
Amin Value : Rs. 4,00,000/-
Present Estimation : Rs. 2,11,140/-
B.JAGADESWARA RAO
Advocate, Visakhapatnam
Cell : 9440578338

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P. 124/2017 in O.S.133/2006
Between :
Alla Jagannadha Rao ...D.Hr
And
1) Kalla Satyanarayana Ravi
2) Kalla Sunitha ...J.Dr's
వేలం ప్రకటన
పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటార్లు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని తేది. **17-04-2023** న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **17-04-2023** ఉదయం గం॥**10.30** ని॥ల నుండి **సా॥5.00 గం॥**ల మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తిగలవారు పై తేదిన, పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
SCHEDULE OF PROPERTY
All that piece and parcel of land measuring 35.25 Sq.yds or 29.47 Sq.Mts of undivided and unspecified share out of 706.5 Sq.Yds or 590.725 Sq.Mts along with unfinished flat with a plinth area of 930 Sft. (Including common areas and balcony) bearing Flat No.4A, in Fourth Floor of Datla Enclave situated at Marripalem, covered by T.S.No.121 bearing Plot Nos. 3 and 4 within th limits of G.V.M.C., Visakhapatnam in the registration Sub District, Dwarakanagar and bounded by: **East:** Building belongs to Madhusudhana Rao bearing D.No.58-1-231, **South:** Existing building in Plot No.5 bearing D.No.58-12-5 belongs to D.A.G. Raju and Apartment in Plot No.6, **West:** Existing building bearing D.No.58-1-233 belongs to K. Sudhakar in Plot No.2. **North:** 100 Feet VMC Road. **Boundaries of Flat: East:** Building belongs to Madhusudhana Rao bearing D.No.58-1-231, **South:** Flat No.4D, **West:** Flat No.4B, **North:** 100 Feet VMC Road.
DHR Value : Rs. 5,00,000/-
Amin Value : Rs. 10,00,000/-
JDR Value : Not furnished
G. RADHA KRISHNA MURTHY
CH. SHANTHI, Advocates
Allipuram, Visakhapatnam. **Cell: 9848265567**

మెరుగైన ఫలితాలకు కార్యాచరణ

విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న డిఇఒ చంద్రకళ (ఫైల్)

ప్రజాశక్తి- పి.ఎం.పాలెం : రాష్ట్రంలోనే అత్యధికంగా పదో తరగతి విద్యార్థులు కలిగిన చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెంచడంతో పాటు మిగతా వారు కూడా ఉత్తమ మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పది ఫలితాలు రాకపోవడం, సగానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులు కాక పోవడంతో ఈ ఏడాదైనా కష్టపడి శత శాతం ఫలితాలు సాధించేందుకు 'ప్రత్యేక ప్రణాళికతో బోధన' చేస్తున్నారు.

శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ...

పదవ తరగతి పిల్లల విషయంలో చదువు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ ఏడాదిలో ఐదు సార్లు పేరెంట్స్‌తో ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులందరూ ఈ సమావేశాలకు రాకపోవడంతో ప్రతి విద్యార్థి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. పరీక్షల సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:15 నుంచి 9:15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5:30 వరకు ఏర్పాటుచేస్తున్నారు. సాయంత్రం వేళలో ఎక్కువ సమయం చదవటంతో విద్యార్థులకు ఆకలి ఇబ్బందులు ఎదురవ్వకుండా వీజ్జీస్ ఫౌండేషన్ సంస్థ ద్వారా దాతల సహకారంతో రెండు లక్షలకు పైగా విరాళాలు సేకరించి 865 మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు రూ.1.60 లక్షలతో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

గణితం, సైన్స్ పాఠ్యాంశాలపై దృష్టి

ఉత్తమ మార్కులు సాధించేలా తర్ఫీదు
చంద్రంపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి

ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు...

గతేడాది 764 మంది పరీక్ష రాయగా 388 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగతా వారు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 234 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంలో 142 మంది ఫెయిలయ్యారు. గణితంలో 264 మంది, సైన్సులో 207 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో గణితం, సైన్సు పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తర్ఫీదునిస్తున్నారు. ఎస్ఎ-1 పరీక్షలో ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి తర్ఫీదునిస్తున్నారు.

విద్యార్థులను దత్తత తీసుకున్నాం...

ఈ ఏడాది 865 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న 100 మంది ఉపాధ్యాయుల్లో ఒక్కొక్కరు తొమ్మిది మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాము.

-ఎం.రాజబాబు
ప్రధానోపాధ్యాయులు,
చంద్రంపాలెం పాఠశాల

సందేహాలు తీరుతున్నాయి...

తరగతి గదిలో చెప్పే పాఠాలలో ఏదైనా సందేహాలు కలిగినప్పుడు వాటిని పాఠశాల ముగిసిన అనంతరం నిర్వహించే శిక్షణ తరగతులలో ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో ఇంటికి వెళ్లి ఎటువంటి ట్యూషనూ లేకుండా చక్కగా చదువుకో గలుగుతున్నాను. పదో తరగతిలో మంచి మార్కులు సాధించగలుగుతాను.

- వినయ్ తేజ్,
పదవ తరగతి విద్యార్థి,
చంద్రంపాలెం పాఠశాల

ప్రణాళిక ప్రకారం చదువుతున్నా...

ఈ ఏడాది ఆరు పేపర్లు కావడం, అందులో సైన్స్ పేపర్ పార్ట్-ఎలో భౌతిక, రసాయనశాస్త్రం, పార్ట్-బిలో జీవ శాస్త్రం ఉండటంతో 3.15 గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తున్నారు. గతంలో రెండు పేపర్ల విధానం ఉండేటప్పుడు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేవారు. ఇప్పుడు రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయం చాలదు. అందుకనే సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకుని పరీక్షలంటే ఆందోళన చెందకుండా మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయుల మార్గనిర్దేశంలో తర్ఫీదు పొందుతున్నాను.

- ఎస్.ప్రశాంతి,
పదోతరగతి విద్యార్థిని,
చంద్రంపాలెం ఉన్నత పాఠశాల

విద్యార్థులకు అండగా యుటిఎఫ్

ఆనందపురం : విద్యార్థులకు సరళమైన రీతిలో విద్యాభ్యాసన కోసం యుటిఎఫ్ కృషిచేస్తోంది. నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులచే ఆరు పేపర్ల ప్యాటన్, ఎగ్జామ్ ఓరియెంటెడ్‌లో మోడల్ పేపర్స్ విత్ ఆన్సర్స్‌తో రూపొందించాం. అన్ని స్థాయిల విద్యార్థులకు ఉపయోగపడే మోడల్ టెస్ట్ పేపర్లను విశాఖ జిల్లా వ్యాప్తంగా 1300 కాపీలను వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశాం. పదో తరగతి పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత, మానసికంగా పరీక్షల సన్నద్ధతకు పలు మోటివేషన్ తరగతులు నిర్వహించాం.

అంబేద్కర్
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నేరాలు ఘోరాలు

17 మంది జూదరులకు జైలు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం స్టేషన్ పరిధిలో 17 మంది జూదరులకు జైలు శిక్ష విధించినట్లు పద్మనాభం ఎస్ఐ నక్క శ్రీనివాసరావు తెలిపారు. 2022లో నమోదైన రెండు కేసుల్లో పేకాట ఆడుతుండగా పట్టుబడిన అయినాడు గ్రామానికి చెందిన ఐదుగురు, రేవిడి వెంకటాపురం గ్రామానికి చెందిన 8 మంది, మద్ది గ్రామానికి చెందిన నలుగురిపై కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు పేర్కొన్నారు. విచారణ తదుపరి భీమిలి 14వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి నాగేశ్వరరావు వీరికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎమ్మెల్సీగా ఎన్నికైన అనురాధను సత్కరిస్తున్న సత్య తదితరులు

ఎమ్మెల్సీ అనురాధకు అభినందనలు

ప్రజాశక్తి -తగరపువలస : శాసన సభ్యుల కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పి.అనురాధను శనివారం ఉండవల్లిలో పద్మశాలి బిసి సాధికారిక డైరెక్టర్ వానపల్లి సత్య, సంఘం జిల్లా కన్వీనర్ పప్పు శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావు, జివిఎంసి రెండో వార్డు టిడిపి ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి, వానపల్లి నరసింగరావు కలిసి అభినందించారు. పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు.

ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి సురేష్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్‌పై నిర్మించిన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం మేయర్ గొలగాని హరివెంక కుమారి, డిప్యూటీ మేయర్ శ్రీధర్, జివిఎంసి కమిషనర్ రాజాబాబుతో కలిసి సందర్శించారు. ఈ నెల 28, 29 తేదీల్లో జి-20 సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో నగరానికి వచ్చే విదేశీ ప్రముఖులు, కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించనుండటంతో మంత్రి ముందుగా పరిశీలించారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు విధానాన్ని, దానిని నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ తదితర విషయాలను ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజినీర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో సుందరీకరణ పనులను పరిశీలించి, పనులు త్వరిత గతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టమ్ పరిశీలన

కంచరపాలెం : జివిఎంసి 51వ వార్డు పరిధి రవాణాశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న పంప్ హౌస్‌ను విదేశీ ప్రతినిధులు వీక్షించనున్న నేపథ్యంలో స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టమ్‌ను మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం పరిశీలించారు. స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టమ్ పనితీరును మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ రాజాబాబు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, నీటి విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ రవి, జోన్ -5 కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఇఇ ఏడుకొండలు ఎఇ గణేష్ పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు ఎస్‌బిజి నగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు, కాలువ పనులకు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దిల రాజశేఖర్, గాడు అప్పలనాయుడు, కె.సత్యనారాయణ, స్థానికులు బీజపు పైడిరాజు, శ్రీనివాసరావు, గణపతి, సన్యాసిరావు, బలగం సుధాకర్, మద్దిల రాజేష్, వెంకటరావు, కొండమ్మ పాల్గొన్నారు.

నేడు విటమిన్ డి పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : సేవా స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యాన అపోలో డయాగ్నొస్టిక్ సౌజన్యంతో ఆదివారం రవీంద్రనగర్‌లోని కార్యాలయం వద్ద మహిళలకు విటమిన్ డి పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. రూ.1850 విలువ చేసే విటమిన్ డి పరీక్షను కేవలం రూ.199కే చేయనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి వంద గ్రాముల వుమెన్ హార్లిక్స్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా భావంతో 'న్యూ లైఫ్ స్కూల్'

ప్రజాశక్తి- ఆనందపురం : లాభాపేక్షే ధ్యేయం కాకుండా, నైతిక విలువలతో గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు విద్య అందిస్తున్న న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సేవలు ప్రశంసనీయమని ఆంధ్ర యూనివర్శిటీ సోషల్ వర్క్ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్.శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గొట్టిపల్లి న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 17వ వార్షికోత్సవానికి శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్యామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామంలో కార్పొరేట్ విద్యా సంస్థ మాదిరిగా అన్ని వసతులు కల్పిస్తూ అతి తక్కువ ఫీజులతో ఆంగ్ల విద్యను అందించడమే కాకుండా అనాథ బాలబాలికలను అక్కున చేర్చుకొని ఉచిత విద్యను అందిస్తున్న న్యూ లైఫ్ విజనరీ డైరెక్టర్ డాక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్, ప్రిన్సిపల్ కె.జయశ్యామ్‌ను ఆయన అభినందించారు. గ్రామీణ వైద్యుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోష్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. సర్పంచ్ గంటా జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఈ పాఠశాల ద్వారా గొట్టిపల్లి పంచాయతీకి గుర్తింపు వచ్చిందన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్యామ్‌మాథ్యూస్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో లాభాపేక్ష లేకుండా సేవాభావంతో 2005లో ఇక్కడ పాఠశాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో బాలికల కోసం ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపల్ జయశ్యామ్ వార్షిక నివేదికను వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్య, క్రీడ, ఇతర రంగాలలో రాణించిన వారికి అతిథుల ద్వారా బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్యామ్‌మాథ్యూస్ తదితరులు

కాలుష్య రహిత ఎపికి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అలోచలనకు అనుగుణంగా కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి, తరగని ఇంధన వనరులు, స్థిరమైన సాంకేతికతని అన్ని రంగాలలో అమలు చేయడానికి ఈ ప్రభుత్వం సంకల్పించిందని నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. ఆర్‌కె.బీచ్‌లోని కాళీమాత గుడి నుంచి ఎయు.కన్వెన్షన్ హాల్ సెంటర్ వరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సి సౌజన్యముతో విద్యుత్ క్యాంపెయిన్ రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్డు షోను కెకె.రాజు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రమణారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ జనరల్ మేనేజర్ సిబి.జగదీశ్వరరెడ్డి, ఇఇ కె.శ్రీనివాసరావు, నెడ్ క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎంవికె.రాజు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్‌రాజు, కెవిఎన్ శశికళ, ఆళ్ళ శ్రీను పాల్గొన్నారు.

'బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం'

ప్రజాశక్తి-సీతమ్మధార : బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా భారత రిపబ్లిక్ పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం శనివారం బుల్లయ్య కాలేజీ సమీపంలోని బిఆర్.అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, దేశంలో ఇంకా అసమానతలు, అణిచివేత కొనసాగుతూనే ఉన్నాయన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్, అతిథులుగా ప్రొఫెసర్ పిడి.సత్యపాల్, ప్రొఫెసర్ సి.ప్రజ్ఞ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ హాజరయ్యారు.

జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : దళిత క్రైస్తవులు ఎస్‌సి కులం పొందేలా అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ రామా టాకీస్ వద్ద గల విజేత ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు పాలాభిషేకం చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జాక్ ప్రెసిడెంట్ అనిల్ పాల్, డేనియల్ శ్యామ్ గాబ్రియల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెంలో జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్‌ఆర్ ఆసరా పథకం లబ్ధిదారులు శనివారం గ్రామ సచివాలయం వద్ద పాలభిషేకం చేశారు. పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ మాట్లాడుతూ, వైఎస్‌ఆర్ ఆసరా పథకం కింద తమ పంచాయతీకి రూ.40 లక్షలు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, విఒఎలు, సిసిలు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో 7 కంపెనీలతో 345 ఖాళీలకు నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో, ఫార్మసీ ఉత్తీర్ణులైన 348 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 98 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధి అధికారి సి.ఉమాదేవి, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, జూనియర్ ఉపాధి అధికారి సిహెచ్.కుమారస్వామి, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కృష్ణ చైతన్య, లత, శ్రీధర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'కణితి' విద్యార్థులు

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం : జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలకు జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మార్చి 8 తేదీన జరిగిన సెలక్షన్ ప్రక్రియలో 7, 8, 9 తరగతుల విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపారు. ఆరుగురు బాలికలు, ఐదుగురు బాలురు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయిలో జరిగే 30వ జాతీయస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలలో పాల్గొనేందుకు పాఠశాల నుంచి వెళుతున్నారు. పోటీలకు వెళ్తున్న తొమ్మిదో తరగతి విద్యార్థినులు సిహెచ్.సునీత, ఎం.తేజశ్రీ 8వ తరగతి విద్యార్థిని ఎస్.సాయిలిఖిత, డి.చందన, ఒ.చరిష్మా, ఎన్.రిషిత, తొమ్మిదో తరగతి విద్యార్థులు బి.లవకుమార్, టి.జైశ్రీవర్ధన్, వి.మనోజ్‌కుమార్, డి.మహేష్‌కు పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవిందా, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, సిహెచ్ వి రమణ, బోండా గోవిందరాజులు, ఆడారి శ్రీను, నరవ రమణ, గెద్దాడ నాగరాజు, రామిరెడ్డి అభినందించారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం : బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన 40 లక్షల జనాభా గల బోయ, వాల్మీకి కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలనే ఆమోదించడం దుర్మార్గమన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బయ్యే మల్లయ్య మాట్లాడుతూ, ఈ తీర్మానం ఆమోదించకూడదని రాష్ట్రపతికి, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతి అందజేస్తామని తలెఇపారు. లాలూ బుక్యా మాట్లాడుతూ, ఏ సామాజిక తరగతినైనా ఎస్‌టి జాబితాలో చేర్చాలంటే బిఎన్.లోకూర్ కమిటీ నిబంధనల ప్రకారమే జరగాలన్నారు. ఆదివాసీ తెగలతో ఎటువంటి సంబంధం, పోలికలు లేని వారిని చేర్చడం వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనని విమర్శించారు. జిల్లా నాయకులు శోభన్ కుమార్ మాట్లాడుతూ, ఇంత జరుగుతుంటే గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు సమావేశంలో నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ గిరిజన సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు మంత్రులు అందరూ రాజీనామా చేసి గిరిజన జాతి మనుగడ కోసం పని చేయాలని కోరారు. ఈ ధర్నాలో ఎ.రవీంద్ర, ఎమ్.కృష్ణయ్య, కె.కృష్ణయ్య, జె.రామన్న, కె.చిన్నంనాయుడు, ఎమ్.రాజేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, దాకే సువర్ణరత్నం, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రతినిధులు

త్రిపుర బాధితులకు సంఘీభావ నిధి

సంఘీభావ నిధిని సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : త్రిపురలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాల దాడిలో గాయపడిన వారికి సంఘీభావ నిధిని స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన ప్లాంట్‌లో సేకరించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఈ నెల 2న రాష్ట్ర అసెంబ్లీ ఫలితాలు వెలువడుతున్న సమయంలోనే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు భౌతిక దాడులకు పాల్పడటాన్ని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంతో ప్రతిపక్షాలపై దాడులకు దిగుతోందని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు భౌతిక దాడులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తుండటంతో ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని తెలిపారు. ఇది అన్యాయమని ప్రజాస్వామ్యవాదులు గళం విప్పితే ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు భౌతిక దాడులకు దిగి ధన, మాన ప్రాణాలను హరించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, గంగాధర్, నీలకంఠం, డి.కృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, బిఎన్.మధుసూదన్, ఆర్.దుర్గాప్రసాద్, డి.శ్రీనివాస్, కర్రి వీరాస్వామి, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సేఫ్టీ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూకాలనీలోని బ్యాంక్వేట్స్‌లో విశాఖ సేఫ్టీ క్లబ్ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ లోగో, వెబ్‌సైట్, టీ షర్ట్స్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇతరుల భద్రతను నిర్ధారించడంలో పౌరులు ముఖ్య పాత్రపోషించాలన్నారు. భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు నియమ నిబంధనలు రూపొందించాయని, వాటిని పాటించాలని కోరారు. సమాజంలో భయం లేని వాతావరణాన్ని నెలకొల్పడంలో అందరూ ముఖ్య మైన పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ ట్రస్టీ సి.బాలసతీష్, అపోలో హాస్పిటల్ అత్యవసర వైద్యాధికారి పి.శ్రీనివాస్, విశాఖ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సేఫ్టీ క్లబ్ ప్రారంభంలో మంత్రి అమర్‌నాథ్

గుండె వ్యాధుల వైద్య శిబిరం

ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆనంద్ కుమార్

ప్రజాశక్తి- కంచరపాలెం : ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ (ఎటిఆర్ ట్రస్ట్) సౌజన్యంతో జివిఎంసి 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాలులో గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన వార్డు వైసిపి అధ్యక్షులు చుక్కా ప్రసాద్‌రెడ్డి, నమ్మి శ్రీను సమక్షంలో వైద్యులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా నియోజకవర్గంలో ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరం నందు 112 మందికి గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యల్లపు వెంకటేశ్వరరావు, దొడ్డి సతీష్, రామకృష్ణ, బోర అప్పలరెడ్డి, బేగం పాల్గొన్నారు.

జర్నలిస్టు రవికుమార్‌కు అవార్డు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీనియర్ జర్నలిస్టు ధవళేశ్వరపు రవికుమార్‌కు ఉత్తరాంధ్ర ప్రాంతానికి సంబంధించి 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డును తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రకటించింది. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వివిధ విభాగాల్లో జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేయాలని దరఖాస్తులు ఆహ్వానించింది. అందులో భాగంగా రవికుమార్‌ను 'బహుముఖ ప్రజ్ఞాశాలి' పురస్కారానికి ఎంపిక చేసింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులకు రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. రవికుమార్‌కు అవార్డు పట్ల పలువురు పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు.

జివిఎంసి హైస్కూల్‌లో ఫేర్‌వెల్

ప్రజాశక్తి - ములగాడ: జివిఎంసి 40వ వార్డు పరిధి షిప్‌యార్డు న్యూ కాలనీలోని జివిఎంసి హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు శనివారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి విద్య మీద శ్రద్ధ వహిస్తూ శత శాతం ఫలితాలకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు,

'అంగన్‌వాడీ' భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐసిడిఎస్ 1, 2 పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అర్బన్ సిడిపిఒలు రమణకుమారి, శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్-1లో 3 ఆయా పోస్టులు, అర్బన్-2లో 7 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్ సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని తగిన నివాస ధ్రువపత్రాలతో అర్బన్ కార్యాలయాల్లో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.

కోనేరు గట్టుపై కొబ్బరి మొక్కలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పద్మనాభం జంక్షన్ సమీపంలో ఉన్న కన్నయ్య కోనేరు గట్టుపై ఎంపిపి కంటుబోతు రాంబాబు కొబ్బరి మొక్కలు నాటారు. గతంలో ఈ కోనేరు ఎంతో ప్రత్యేకంగా ఉండేది. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో చెత్త, పిచ్చిమొక్కలతో పూడుకుపోయింది. ఇటీవల అనంతపద్మనాభ స్వామి తెప్పోత్సవాన్ని నిర్వహించేందుకు ఈ కోనేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. కోనేరులో మట్టిని తవ్వి, మోటార్ల ద్వారా నీటిని నింపారు. ప్రస్తుతం గట్టుపై కొబ్బరి మొక్కలు వేశారు. కోనేరును అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని ఎంపిపి రాంబాబు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకులు థమన్

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను సినీ సంగీత దర్శకులు థమన్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్థంబాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోను ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఆయన వెంట ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్ రాజ్, సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి, ఆలయ పిఆర్‌ఒ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన చైర్‌పర్సన్

- తను సూచించిన అజెండా చేర్చకపోవడంపై నిరసన
- పంతం నెగ్గించుకున్న రమాకుమారి
- ఆలస్యంగా సాయంత్రం జరిగిన కౌన్సిల్
- గుత్తేదార్లు ముందుకు రాక రూ.51.5 లక్షల విలువైన పనుల రద్దు

ప్రజాశక్తి-యలమంచిలి

తాను సూచించిన విద్యుత్ మీటర్ల అంశాన్ని కౌన్సిల్ ఎజెండాలో చేర్చకపోవడంపై ఆగ్రహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి ఇంటికి వెళ్లిపోయారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రారంభం కావలసి ఉంది. అయితే తను సూచించిన అంశం చేర్చకపోవడంతో ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం వేదిక దిగి వెళ్లిపోయారు. దీంతో అధికారులు చైర్‌పర్సన్ సూచించిన విద్యుత్ మీటర్ల అంశాన్ని ఎజెండాలో చేర్చడంతో సాయంత్రం 4.30 గంటలకు తిరిగి సమావేశం ప్రారంభమైంది.

ఎజెండాలో ముఖ్యమైన అంశంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు రూ.51.5లక్షలను రద్దు చేస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. డ్రైన్లు, సిసిరోడ్లు, మొక్కలు నాటడం తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి ఈ నిధులు కేటాయించగా, సకాలంలో బిల్లులు రాక, ఎప్పుడొస్తాయోనన్న భయంతో ఆ పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఆ నిధులను రద్దు చేస్తున్నట్లు కౌన్సిల్ తీర్మానించింది. ఆ సొమ్మును విద్యుత్ బకాయిలకు చెల్లిస్తూ తీర్మానించడం మరో విశేషం.

ప్లానింగ్ చట్టానికి విరుద్ధంగా నిర్మించిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు కనెక్షన్ ఇవ్వరాదని మున్సిపల్ అధికార్లు నోటీసుల అనంతరం కోర్టులో కేసులు వేయడంతో, అది ప్రజలకు ఇబ్బందికరంగా పరిణమించిందని, ఈ అంశాన్ని కౌన్సిల్ ఎజెండాలో చేర్చాలని సభ్యులు కోరగా, టౌన్‌ప్లానింగ్ అధికార్లు అందుకు ససేమిరా అన్నారు. దీంతో కౌన్సిల్‌లో రభస మొదలైంది. అలా అభ్యంతరం తెలిపిన 157 గృహాలకు కోర్టు తీర్పునకు సిరసావహించే విధంగా అఫిడవిట్ తీసుకొని వినియోగదారులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానించింది. ఎదురయ్యే పరిణామాలన్నింటికీ కౌన్సిల్ కట్టుబడి ఉంటుందని తీర్మానంలో పేర్కొన్నారు. రూ.90 లక్షలతో కొమ్మాయి గుండం చెరువు పునరుజ్జీవనం పథకం పనులు ప్రభుత్వ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు ఇచ్చే బదులు మనమే బాగు చేసుకోవచ్చు గదా అని కొందరు సభ్యులు అడగ్గా, ఆ పని ప్రభుత్వమే చేపట్టాలని తీర్మానించారు. సైతారుపేటరోడ్డు జంక్షన్ నుండి దుర్గమ్మ గుడి వరకు విద్యుత్ దీపాలు వేసే కార్యక్రమానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమిషనర్ తోట కృష్ణవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఇంజనీర్లు సునీల్, ఉమామహేశ్వరరావు, టిపిఓ శ్రీలక్ష్మీ, మేనేజర్ ప్రభాకరరావు, మెప్మా పద్మావతి, వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, మరో 15 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

అభివాదం చేస్తున్న నూతన సారథులు

యుటిఎఫ్ మండల కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి - మునగపాక రూరల్ : మండలంలోని నాగులాపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం జరిగిన యుటిఎఫ్ మునగపాక మండల సర్వసభ్య సమావేశంలో మండల కార్యవర్గం ఎన్నికైంది. మండల గౌరవ అధ్యక్షులుగా సుగుణ, అధ్యక్షులుగా కట్టా రమణమూర్తి, సహాధ్యక్షులుగా వందనాల పావని, ప్రధాన కార్యదర్శిగా మాటూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా సేనాపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ విశేషంగా కృషి చేస్తుందని చెప్పారు.

కశింకోట : యుటిఎఫ్ కశింకోట మండలం నూతన నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. మండల అధ్యక్షునిగా వి.శివప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, సహ అధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, జి హేమ కుమారి, ప్రధాన కార్యదర్శిగా వి.రమేష్ రావు, సహాయ కార్యదర్శులుగా ఎమ్ తేజవర్ధన్, రెహానా సుల్తాన్, కోశాధికారిగా బి అజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లు జికెఆర్ స్వామి, జె జేసుదాసు ఈ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో ఆడిట్ కన్వీనర్లు ఎమ్ దేవి, యస్ గౌరీ, సిపియస్ కమిటీ మెంబర్లు బి అజయ్, ఎమ్ తేజవర్ధన్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎంపీ, ప్రభుత్వ విప్, కలెక్టర్ తదితరులు

మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళాభివృద్ధితోనే రాష్ట్రం పూర్తి అభివృద్ధిని సాధిస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధ్యక్షతన శనివారం వైయస్సార్ ఆసరా పథకం కింద జిల్లాకు చెందిన 34,935 డ్వాక్రా సంఘాలకు రూ.276 కోట్ల 77 లక్షలు మూడవ విడత కింద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాకు చెందిన మహిళలు మూడు విడతల్లో 821 కోట్ల 47 లక్షల రూపాయలు లబ్ధి పొందారన్నారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరు లో వైయస్సార్ ఆసరా మూడవ విడత నిధులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పథక సంచాలకులు లక్ష్మీపతి, మెప్మా పథక సంచాలకులు సరోజినీ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం

గుంటూరు బాపనయ్య వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

బాపనయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడటమే గుంటూరు బాపనయ్యకు అందించే నిజమైన నివాళి అని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కామ్రేడ్ గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు ఏ బాలకృష్ణతో కలిసి లోకనాథం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన బాపనయ్య చిన్ననాడే కుల వివక్షతకు గురయ్యారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించిన ఆయన ఐదేళ్ల జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, మూడుసార్లు శాసనసభ్యులుగా, ఒకసారి శాసనమండలి సభ్యునిగా పనిచేశారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక ఉద్యమ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్. శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, గంట శ్రీరామ్, నాయకులు కె ఈశ్వరరావు, సిహెచ్ శివాజీ, చలపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చోడవరం : ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం 12(1)సి ప్రకారం 2023-2024 విద్యా సంవత్సరంలో చోడవరం మండలంలోని అన్ని ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదలు, అనాధ పిల్లలు, హెచ్ఐవి బాధితుల పిల్లలు, వికలాంగుల నుండి అర్హత కలిగిన పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 25శాతం సీట్లు కేటాయిస్తూ 2023-24 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో కోసం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ.1,44,000 ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

బ్రెయిన్ ట్యూమర్ రోగికి పిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న రోగికి రెండు లక్షల రూపాయల ప్రధానమంత్రి సహాయ నిధిని పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి శనివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నాతవరం మండలం వెదురుపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన పి రామకృష్ణ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతను వైద్య ఖర్చుల కోసం ఎంపీ సత్యవతి అర్జించాడు. దీంతో ఆమె స్పందించి పీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేయగా మంజూరైన ధ్రువపత్రాన్ని రోగి రామకృష్ణ సోదరుడు శ్రీనివాసు అందజేశారు.

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఏప్రిల్ ఐదో తేదీన జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారము స్థానిక సిఐటియు కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, అన్నివర్గాల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26000 అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.10000 ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల నాయకులు ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, గండి నాయనిబాబు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

అచ్యుతాపురం : కార్మిక, రైతు, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారానికి ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము పిలుపునిచ్చారు. మండలంలోని పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి ఉపాధి కూలీలతో సమయసమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు వరాలమ్మ, మంగమ్మ, సోములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి వైసిపి ఎమ్మెల్యేలను పది నుంచి 20 కోట్ల రూపాయలతో కొనుగోలు చేసినట్లు ఆరోపించడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని పక్కదో పట్టించేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకష్ణ, ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా మలసాల రమణారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎన్.జి.పేట గ్రామంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రమణారావు ధనమ్మ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు గూడాపు ప్రకాష్, గాలి శ్రీనివాసరావు, తురకలపూడి రాజు, పప్పల అప్పారావు, నారాయణ రావు, కొనిరెడ్డి కన్నయ్య, కరణం బాబ్జి, వేతన కార్యదర్శులు ఢిల్లీ రావు, రామకృష్ణ, జెర్రిపోతుల నూకనాయుడు, గొంతిన శ్రీను, సంజీవరావు, ప్రసాద్, గోవింద దాస్, రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రమణారావు, ధనమ్మ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం



బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం కోర్టు బారు అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన కాండ్రేగుల డేవిడ్, ఇతర సభ్యులు శనివారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా డేవిడ్, సభ్యులు చోడవరం కోర్టులో ఉన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణవేణి, సభ్యులు ప్రసాద్ నాయుడు, కామిరెడ్డి వెంకట్రావు, దొర పాల్గొన్నారు.

దిలీప్ కుమార్‌కు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం పరామర్శించారు. ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్ కుమార్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలల వార్షికోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ, కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పాఠశాలల వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, నాగమణి మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులు కష్టమని భావించకుండా ఇష్టంగా చదివి పది ఫలితాల్లో అద్భుత ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వేచలంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కసింకోట అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినిలకు పరీక్షల సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యమ్ అప్పలరాజు, వసతి గృహ సంక్షేమ అధికారిణి పి నిర్మల, కొరిబిల్లి పరమేష్, వీరేంద్ర, జీవీఎంసీ ఉద్యోగి శివలంక సత్యనారాయణ, విజ్జు వీరేంద్ర, కాండ్రేగుల శంకర్, పావాడ సన్యాసిరావు, చంటి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో పరీక్షా మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, హెచ్ఎం ఉదయ్ భాస్కర్, కొరుప్రోలు వెంకట రమణ, పెద్దడ వెంకట రమణ పాల్గొన్నారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా కుంచంగి ఎంపీటీసీ సభ్యులు పల్లేల శివ మతికి కొద్దిసేపు సంతాపం ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సభ్యులు తమ తమ గ్రామాల సమస్యలను సమావేశంలో తెలియజేస్తే వాటి పరిష్కారానికి కావలసిన నిధులను అందజేస్తామని చెప్పారు. గ్రామాలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనకాపల్లి కొత్తూరు నుంచి రావికమతం వరకు కెబి రోడ్డును రూ.32 కోట్లతో పనులు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే తుమ్మపాల -చోడవరం రోడ్డు పనులు చేపడతామన్నారు. మండల శాఖ అధికారులు తమ తమ శాఖల పనితీరును వివరించారు. మెజారిటీ సభ్యులు డ్రైనేజీ, రోడ్లు, ఇంటింటికి కుళాయిలు, తాగునీటి సమస్యలపై సుమారు రెండు గంటలసేపు వివరించారు. ఈ సమావేశంలో పిఆర్‌డిఈ వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దారు శ్రీరామ్మూర్తి, ఇన్చార్జ్ ఎంపీడీవో ధర్మారావు, ఎన్టీఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్య కుమారి శేఖర్, అయిత ఆనంద రాము, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల ప్రత్యేక అధికారిని డి.నాగలక్ష్మికి శనివారం జిల్లా పంచాయతీ కార్మికుల అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పంచాయితీ పారిశుధ్య కార్మికులకు 6 నుంచి 9 నెలల వరకు వేతన బకాయిలు ఉన్నాయని. పారిశుధ్య కార్మికులకు బట్టలు సబ్బులు, జోళ్ళు, నూనె ఇవ్వడం లేదని తెలిపారు. మరణించిన కుటుంబాలకు దహన సంస్కారం నిమిత్తం రూ. 5000 వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాండ్రేగుల శచీదేవి, సిఐటియు నాయకులు ఎర్ర దేవుడు, పంచాయితీ కార్మికులు ఈశ్వరరావు, పెంటయ్య, దేవుడు బాబు, రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ పక్వాడ'

పోషణ్ పక్వాడలో పాల్గొన్న సర్పంచ్ సుజాత

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం అంగన్ వాడీ సెంటర్-1లో పౌష్టికాహార పోషణ్ పక్వాడపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, ఇఒఆర్డీ పద్మజ మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు మంచి విటమిన్లు ఖనిజాలు ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పంచాయతీల కార్యదర్శులు సోమునాయుడు, రమేష్, అంగన్‌వాడీ వర్కర్లు ముత్యాలరాణి, రమాదేవి, ముత్యాలమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

సబ్బవరం : పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుల్లేపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన పోషణ పక్వాడా కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ శ్రీను, కార్యదర్శి బ్రహ్మ, సూపర్ వైజర్ స్వర్ణ ,అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా పోషకాహారం అందించాలని స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎల్ బి సుశీల అన్నారు. మండలంలోని ఆర్ వై అగ్రహారం, ఉగ్గిన వలస యడ్ల వానిపాలెం అంగన్వాడి కేంద్రాల్లో పోషణ్ పక్వాడ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జె సన్యాసిరావు, ఎంఎల్‌హెచ్‌పి ఎస్ కిరణ్ జోసెఫ్, ఏఎన్ఎం వై రాము , ఆశా వర్కర్ ఎల్ రమణమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, వై ముత్యాలమ్మ ,వై రమణమ్మ , వెంకటలక్ష్మి, రవణమ్మ, పాల్గొన్నారు.

వడ్డాది : ఐసిడిఎస్ ద్వారా రక్తహీనతను నిర్మూలిద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. బుచ్చయ్య పేట మండలం లోపూడి-2, బంగారు మెట్ట, ఎల్బిపి అగ్రహారం, వడ్డాది అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రభావతి, ఎంఎల్‌హెచ్పి హేమలత, అంగన్వాడి కార్యకర్తలు కె జ్యోతి, వరహాలమ్మ, సత్య అమ్మాజీ, పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎం.అలమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ సర్పంచ్ దాడి జగన్నాథరావు తన సొంత నిధులతో ఫ్యాన్లు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అరుణకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోకాడ దేవి, పోలిపురెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.



ఫ్యాన్లు అందజేస్తున్న సర్పంచ్ జగన్ తదితరులు

మామిడి దిగుబడి పెంచేందుకు చర్యలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మామిడి దిగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పాతవలస గ్రామానికి వచ్చినప్పుడు మామిడి దిగిబడి తగ్గడంపై రైతులు ఆందోళన వెలిబుచ్చారు. దీంతో శనివారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు పాతవలస వచ్చి మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. హుదూద్ వచ్చిన దగ్గర నుండి మామిడి పంట ప్రతి ఏడాది తగ్గిపోతూ వస్తుందని రైతులు తెలిపారు. ఈ సంవత్సరం 70శాతం కాపు తగ్గిందని, వచ్చే సంవత్సరానికి అది కూడా ఉండదేమోనని రైతుల అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే సంవత్సరం నుండి మామిడి పంట దిగుబడి పెంచడానికి ఉద్యాన శాస్త్రవేత్తలతో పర్యటించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం పంటలను పరిశీలించారు.

130 ఎకరాల్లో నీట మునిగిన నువ్వు పంట

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఐదు రోజుల పాటు కురిసిన వర్షాలకు మండలంలో 130 ఎకరాల్లో నువ్వు పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి బి.శంకర్ గోవింద్ తెలిపారు. మండలంలో జగ్గంపేట, కాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. ముంపునకు గురైన నువ్వు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ పంట తిరిగి కోలుకోవడానికి ముందుగా నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం ఎన్ పి కె 17 17 మందును లీటరుకు ఐదు గ్రాములు చొప్పున ఎకరా విస్తీనానికి 200 లీటర్ల మందును పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కెబి సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పందిరి రాట

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని తాణాం గ్రామంలో రామాలయం వద్ద సీతారాముల కళ్యాణం పెళ్లి రాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కన్నూరు దేవివెంకటరమణ పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమములో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పైలా జగన్నాధరావు, ఉప సర్పంచ్ వర్రి మంగ లక్ష్మి, వసంతరావు, నాయకులు చీపురుపల్లి శ్రీను, జి సతీష్, పైల్ జానకిరావు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి ఐజి పరామర్శ

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రమాదవశాత్తు మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఐజి కెవీ.రంగారావు శనివారం పరామర్శించారు. విశాఖపట్నం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావు ఇటీవల భీమిలి రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులు కె.కోటపాడు మండలం జోగన్నపాలెంలో నివాసముంటున్నారు. బాధల్లో ఉన్న ఆ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఐజి కెవి రంగారావు తన సతీమణితో కలిసి శనివారం జోగన్నపాలెం వచ్చారు. సన్యాసిరావు కుటుంబ సభ్యులకు రావలసిన సదుపాయాలన్నీ తక్షణమే కల్పిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఐజి వెంట ఆర్ఐ రామకృష్ణ, సిఐ తాతారావు, ఎస్సై ధనుంజయ్ ఉన్నారు.

యుకెజి విద్యార్థుల స్నాతకోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో యూకేజీ చిన్నారుల స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ మహేష్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని సమగ్ర భూసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు నక్కవాని పాలెం, సబ్బవరం పంచాయితీ శివారు గొర్లివాని పాలెం గ్రామాల్లో సర్వే పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ రీ సర్వే వలన రైతులకు తమ భూముల్ని సరియైన కొలతలతో సర్వే చేసి హద్దులను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ చిన్నికృష్ణ

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:త్వరగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపిడిఓ సీతారామరాజు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఉపమాకలో జగనన్న లేఔట్‌లో చేపడుతున్న గృహ నిర్మాణ పనులను శనివారం ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, హౌసింగ్ ఏఈ రాజులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న లేఅవుట్‌లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చూడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంకు కృషి చేయాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. శనివారం హౌసింగ్‌డే ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భగా ఎంపిడిఒ మాట్లాడుతూ గృహ లబ్ధిదారలకు సంబంధించిన ఇళ్లను సకాలంలో పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, నీటి సదుపాయాలు, ఎలక్ట్రికల్ వంటివి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటవురట్ల:ప్రభుత్వం అంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ అన్నారు. శనివారం మండలంలో కొడవటిపూడి, చిన్న బొడ్డేపల్లి గ్రామాల్లో నిర్మితమవుతున్న జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,మెటీరియల్ అందుబాటులో ఉంచామని బిల్లులు సకాలంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో చంద్రశేఖర్, చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివరాం, కొడవటిపూడి సర్పంచ్ అప్పారావు హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను హెచ్ఎం వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉత్తమమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలన్నారు. మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన భవనం

27న మండల పరిషత్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం : మండల పరిషత్ భవనంను చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఈనెల 27న ప్రారంభించనున్నారు. ఎంపిపి పైలరాజు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. 2008లో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వేరే ప్రత్యామ్నాయం లేక ఉద్యోగులు అదే భవనంలో బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వహించే వారు. నిధుల కొరతతో రెండు అంతస్తులతో నిర్మించే నూతన భవనం మధ్యలో ఆగిపోయింది. ఈ నేపథ్యంలో మండల పరిషత్తు జనరల్ ఫండ్ నిధులు సుమారు 40 లక్షలతో కింద అంతస్తుని పూర్తి చేశారు. ఎంపిపి, ఎంపిడీవో చాంబర్స్, ఇతర అధికారులకు వేరువేరు గదులు కేటాయించారు. ఫర్నిచర్, కంప్యూటర్లు ఇప్పటికే అమర్చారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల్లో 8 వాలంటీర్ పోస్టుల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడీవో సీతారామరాజు ప్రకటనలో తెలిపారు. శనివారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు.మండలంలోని చినదొడ్డిగల్లు 2 (ఎస్సీ మహిళ), (ఓసి మహిళ)భోదిగల్లం 1 (బిసి ఈ మహిళ), ఉపమాక 1 (ఎస్సీ మహిళ), అమలాపురం 1 (ఓసి జనరల్),పెదతీనార్ల 1 (బీసీ జనరల్), నెల్లిపూడి 1(జనరల్ మహిళ),ఢొంకాడ 1(ఎస్సీ మహిళ) వాలంటీర్ల పోస్టులకు సంబంధించి అర్హత కలిగిన వారు ఈనెల 26 వ తేదీ నుండి 27 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. 28న దరఖాస్తుల పరిశీలన, 29న మౌఖిక పరీక్ష, 30న ఎంపికైన వాలంటీర్ల వివరాలు వెల్లడి, 31న వాలంటీర్ల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు.

రుణ దరఖాస్తుల గడువు పెంచాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువును పెంచాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. ఈ మేరకు విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈ నెల 27వ తేదీ వరకు మాత్రమే గడువు ఇచ్చారని, ఇంకొంత సమయం పొడిగిస్తే ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్ ద్వారా రూ.60 వేల సబ్సిడీ మాత్రమే ప్రకటించారని, దాన్ని పాత పద్ధతిలోనే లక్ష రూపాయలు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పూడి మల్లేశ్వరరావు, కస్తూరి వెంకటరావు, కోన అరుణరాణి, సిరుపల్లి లలితా కుమారి, త్రివేణి పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న పాపారావు

పాలాభిషేకం చేస్తున్న మహిళలు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఆసరా పథకం డ్వాక్రా మహిళ రుణమాఫీ హామీలో భాగంగా శనివారం సీఎం మూడో విడత రుణమాఫీ నిధులను విడుదల చేయడంతో పాములవాక గ్రామంలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేటలో జరుగుతున్న నూకాలమ్మ తీర్థ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఎడ్ల పందాలు ఉత్సాహంగా జరిగాయి. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బొందల నూకరత్నం, స్థానిక సర్పంచ్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చోడవరం, చీడికాడ, మాడుగుల, కోటపాడు మండలాల నుంచి పోటీదారులు పాల్గొన్నారు. 17 ఎడ్లబండ్లు పందాలలో పాల్గొనగా మొదటి నుంచి ఆరు స్థానాల పొందిన వారికి నిర్వాహకులు నగదు షీల్డ్ బహుమతులను అందజేశారు. ఒకవైపు వర్షం కురుస్తున్నప్పటికీ ఎడ్ల పందాలు ఉత్సాహంగా సాగాయి. బోయంపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు మొదటి బహుమతి 15 వేలు, నరసయ్యపేట గ్రామానికి చెందిన రామకృష్ణకు ద్వితీయ బహుమతి 12 వేలు, తృతీయ 10వేలు, నాలుగవ బహుమతిగా 8 వేలు బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొందల రాజు, మండల వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ(బాబ్జి)లు అందజేశారు. ఈ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు పదివేల మంది వచ్చారు. వర్షంలో గొడుగులు వేసుకొని మరీ ప్రేక్షకులు ఎడ్ల పందాలను తిలకించారు.

పరుగు పెడుతున్న ఎద్దులు

పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం కళాశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఎంతో కాలం తర్వాత కలుసుకున్న వారందరూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 1986 నుండి 2019 వరకు పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతికవిద్య నభ్యసించి వివిధ రంగాలలో స్థిరపడిన 80 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి నాగమణి ప్రోత్సాహంతో ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ జివి రామచంద్రరావు అన్నారు.

అవంతిలో ముగిసిన సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి -మాకవరపాలెం:స్థానిక అవంతి కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటి మానివర్సిటీ ప్రొఫెసర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, వైఫల్యాలు వచ్చినపుడు నిరాశ పడకుండా కష్టపడి పనిచేసినప్పుడు విజయం వరిస్తుందన్నారు. గురువులు, తల్లిదండ్రులు మీ మంచి కోరుకుంటారని విద్యార్థులకు సూచించారు. ప్రాజెక్టులను విస్తృతంగా తయారు చేయాలన్నారు. అవకాశాలు వచ్చినప్పుడే అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వరంగల్ యూని వర్సిటీ ప్రొఫెసర్ ఉదయభాస్కర్, విశాఖపట్నం గరుడ సీఈవో కిరణ్, అవంతి కాలేజీ ఏఈఓ దానియేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతి స్వీకరిస్తున్న విద్యార్థులు

పేద విద్యార్థులకు ప్రవేశాలు

ప్రజాశక్తి-గొలుగొండ:2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 25 శాతం ప్రైవేటు విద్యా సంస్థల్లో 1వ తరగతి సీట్లకు అర్హత కలిగిన పేద విద్యార్థులకు ప్రవేశాల కల్పించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఆరు ప్రైవేటు విద్యా సంస్థలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అర్హులైన్న కావల్సిన పేద విద్యార్థుల తల్లిదండ్రులు సిఎస్ఇ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

27న బహిరంగ సభ

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 27 మధ్యాహ్నం 2 గంటలకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వైయస్సార్ ఆసరా పథకం మూడో విడతకు సంబంధించి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. ఈ బహిరంగ సభకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా సభ్యులు, తదితరులు హాజరు కావాలన్నారు.

మాట్లాడుతున్న హెచ్‌ఎం జయలక్ష్మి

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన కీలకం

ప్రజాశక్తి -రావికమతం:డౌన్ సిండ్రోమ్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయలక్ష్మి సూచించారు. పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, డౌన్ సిండ్రోమ్ పూర్తిగా జన్యు సంబంధమైన వ్యాధి అన్నారు. ఈ వ్యాధి క్రోమోజోముల అపసవ్యతతో వస్తుందని తెలిపారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న గర్భస్థ శిశువుల్లో క్రోమోజోముల్లోని 21వ జతలో ఒక క్రోమోజోమ్ అదనంగా ఉంటుందన్నారు. దీంతో బిడ్డల అసాధారణ ఎదుగుదలకు కారణం అవుతుందని ఆమె తెలిపారు. దీని ఫలితంగా శారీరక, మానసిక ఎదుగుదల సరిగా ఉండదన్నారు. మేనరిక వివాహాల వలన, తల్లి వయసు 35 ఏళ్ల కన్నా ఎక్కువ ఉంటే వారికి పుట్టే పిల్లలు ఇలా డౌన్ సిండ్రోమ్‌తో పుట్టే అవకాశం ఉన్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎర్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేల కూలిన చెట్టు

భారీ వర్షంతో ఇక్కట్లు

ప్రజాశక్తి.మాడుగుల.భారీ వర్షాలు, ఈదురు గాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్రోణి కారణంగా మండలంలో కొద్ది రోజుల నుండి ఈదురు గాలులు వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత సోమవారం ఈదురు గాలులు కారణంగా అనేక గ్రామాలలో చెట్లు నేల కూలాయి. శనివారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. మండలంలోని అనేక గ్రామాల్లో మామిడి పంట పూర్తిగా ధ్వంసం అయ్యింది. వర్షాల కారణంగా అనేక వ్యాపారాలకు నష్టం వాటిల్లింది.

మెటీరియల్ ఇస్తున్న సభ్యులు

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చింపేట గ్రామంలో నవతరం (మన ఊరు మన బాధ్యత) సభ్యులు శనివారం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్‌వి.నరసింహ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరము నవతరం ఆధ్వర్యంలో పరీక్షా మెటీరియల్ ఇస్తున్నారని, గత ఏడాది విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నవతరం సభ్యులు సబ్బవరపు చంటి, కర్రి ఏరుకునాయుడు, చిటికెల అనిమిరెడ్డి రమణ, మద్దాల భరత్‌కుమార్, చిటికెల వెంకటరమణ, నక్కల రాజునాయుడు, నవతరం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యంత్రాంగం :

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు అర్హత సాధించారు.దీంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

భీమునిపట్నం : చిట్టివలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు అర్హత పొందినట్లు సంస్థ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తి ఈశ్వర రావు, రేఖ అప్పారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం లభిస్తుందని వివరించారు. తమ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ పొందిన చిట్టి వలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జె.కీర్తన, ఎస్.షణ్ముఖ, కె.హరికోమల, కె.రఘువర్మ, ఎం.లోహిత్ కుమార్, కె.రితీష్ ఎంపికైన వారిలో ఉన్నారని పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ హైస్కూల్‌కు చెందిన ఎసాయి వర్ధన్, ఎ.ఈశ్వరి, భీమిలి సెయింట్ ఆన్స్ హైస్కూల్‌కు చెందిన ఎం.భవ్య, భీమిలి మండలం, తాళ్ళవలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆర్.జోషిత, వై.దీక్షిత, జీవిఎంసి హైస్కూల్‌కు చెందిన సిహెచ్.సాయికృష్ణ, పద్మనాభం మండలం రేవిడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.జ్యోష్న, వెంకటాపురం ఎంపియుపి పాఠశాలకు చెందిన ఎం.విశాలాక్షి ఎంపికైన వారిలో ఉన్నారని తెలిపారు.

ఎంపికైన గిరిజన విద్యార్థినులు

స్థానిక ప్రభుత్వ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థినులు జె.స్నేహిత, పి సంజన ఎంపికైనట్లు హెచ్ ఎం రామేశ్వరి, ఉపాధ్యాయులు ఆనంద్ తెలిపారు. ఇద్దరు విద్యార్థినులను శనివారం పాఠశాలలో అభినందించారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.లావణ్య ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.శివరాణి తెలిపారు.

తోటగరువు విద్యార్థుల అర్హత

ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఇ.అఖిలేష్, కె.శ్రావ్య అర్హత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవాని తెలిపారు.

వడ్డాది : ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి వేద విద్య, బి ఈశ్వరప్రసాద్ ఉత్తీర్ణత సాధించి ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం నుండి సంవత్సరానికి రూ.12000 చెప్పిన నాలుగు సంవత్సరాల పాటు మొత్తం రూ.48000 స్కాలర్ షిప్ అందించబడుతుందని పాఠశాల హెచ్‌ఎం పీవీ శేషుబాబు తెలిపారు.

సబ్బవరం : ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు నక్క సత్యప్రసాద్ (107), మారడబూడి టీన్స్ ప్రియ(102), కోతల చరిష్మా (99), నక్క సాలోమి ఫ్లోరెన్స్ (89), గంపరాయి కీర్తి (75) ఎంపికైనట్టు ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు సీహెచ్. చిన్నమ్మాయి తెలిపారు. వీరిని మండల విద్యా శాఖాధికారి యస్.అప్పలరాజు,ఉపాధ్యాయులు అభినందించారు.

నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేమగిరి నూకరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏడిద నాగచైతన్య, సొవ్వేటి స్వామిలు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్కు అర్హత సాధించారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో డిఎల్ పురం హెచ్ఎం

వడ్డాదిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కెజె పురం విద్యార్థుల ప్రతిభ

పాలమరశెట్టి జయశ్రీ

ఆడారి ఉషశ్రీ

దిమిలి జ్ఞానేశ్వరి

మాడుగుల:జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎం ఎస్)కు మండలంలోని కేజే పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు అర్హత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన పాలమరశెట్టి జయశ్రీ, ఆడారి ఉషశ్రీ, దిమిలి జ్ఞానేశ్వరి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దాసు విద్యార్థులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు చంద్రరావును అభినందించారు. మండల విద్యా శాఖ అధికారి దేముడమ్మ అభినందిస్తూ విద్యార్థులు అందరూ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు చంద్రరావును అభినందించారు.

సంజనకు అభినందనలు

అభినందిస్తున్న హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అచ్చుతాపురం : మార్టూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈఈగిరుల సంజన 2022-23 సంవత్సరానికి ప్రభుత్వం విడుదల చేసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలలో ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొత్తలి నూకరాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ మెరిట్ స్కాలర్షిప్ అందిస్తుందని తెలిపారు. 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12000ల చొప్పున రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసి మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వం నేరుగా తమ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వినియోగించు కోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు మాత సూర్యలక్ష్మి, శాంతి, సుబ్రహ్మణ్యం, ఎలీషా అభినందించారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన గుడివాడ అనిత (19) నెల 9వ తేదీ నుంచి కనిపించలేదని బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు. తప్పిపోయిన సమయంలో ఆమె నలుపు రంగు పంజాబీ డ్రెస్ వేసుకుందని, ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్కు (944010213) సమాచారం ఇవ్వాలన్నారు.

తేనెటీగల దాడితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని గర్నికం గ్రామంలో తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. గర్నికం గ్రామానికి చెందిన ఆర్లే కాము నాయుడు (65) ఆమె భార్య నూకాలమ్మ (50)లు శుక్రవారం మధ్యాహ్నం బంధలోడు నుయ్యి సమీపంలోని పొలంలో గొర్రెలను మేతకు తీసుకొని వెళ్లారు. అకస్మాత్తుగా తేనెటీగలు ఇరువురుపై దాడి చేశాయి. ఇరువురిని పరిసర ప్రాంతంలో ఉన్న వ్యక్తుల గమనించి కుటుంబీకులు సమాచారం అందించారు. బాధితులను రావికమతం పీహెచ్‌సీకి తరలించారు. s పరిస్థితి విషమించడంతో విశాఖ కేజేహెచ్‌కి తరలించారు. భర్త కామునాయుడు శనివారం కెజిహెచ్ లో మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండల కేంద్రంలోని వినయ్ జూనియర్ కాలేజ్ ఎనిమిదో వార్షికోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కస్పాండెంట్ బత్తుల వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బివికె కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సత్యారావు, రిటైర్డ్ డీన్ ఆంధ్ర యూనివర్సిటీ కే చంద్రమౌళి, మండల విద్యాశాఖ అధికారి ఏఎన్ఎస్ఎన్ మూర్తి, సమాచార కార్యకర్త కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యారావు మాట్లాడుతూ, పిల్లలపై ఎటువంటి ఒత్తిడులు పెట్టరాదన్నారు.

ఆధార్ అప్డేట్ చేయించుకోండి

ప్రజాశక్తి- పాడేరు : ఆధార్ అప్ డేషన్ చేయించుకోవాలని జివిడబ్ల్యువి ఇంచార్జ్, సిపిఒ ఆర్ఎస్ పట్నాయిక్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పాడేరు డివిజన్లో ఉన్న గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంప్‌లో పాల్గొంటున్న ఆధార్ ఆపరేటర్లకు, సూపర్వైజర్లకు శనివారం పాడేరు ఎంపీడీవో కార్యాలయంలో ట్రైనింగ్ నిర్వహించారు. రాష్ట్ర ప్రతినిధి గిరిధర్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్నాయిక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్లు వెంకట్, సునీల్, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

జల జీవన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని ఎరకన్నపాలెం లో జల జీవన్ పనులకు పనులను ఎంపీపీ రుత్తల సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. ఎరకన్నపాలెం గ్రామానికి 22లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం మాట్లాడుతూ, ఇంటింటికి కుళాయిలతో తాగునీటి ఇబ్బందులు తొలగి పోతా యన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు రుత్తల వాసు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి